# పంచవటీ దహనం

పై శీర్షిక కథకి నేను పెట్టింది కాదు. పత్రికల వాళ్ళకి భాషమీద ఇంకా మోజు చావక, ఆ జరిగిన సంఘటనకి ఈ పౌరాణిక శీర్షిక పెట్టారు. "పంచవటి" అనే గుడిసె కాలిపోయింది - అంటే చాలదూ? అయితే ఆ గుడిసెకు "పంచవటి" అని శబ్ద ఆడంబరంగల పేరు మా ఆవిడే పెట్టుకున్నప్పుడు, దానికి ఈడైన విధంగా "దహనం" అని పత్రికి విలేఖరి చేర్చాడంటే తప్పేముంది?

సదరు "దహనా"నికీ నాకూ ఏదో సన్నిహిత సంబంధం ఉందన్న పోలీసువారి అనుమానం కేవలం నిరాధారం. అది జరిగిన రాత్రి నేను పట్టణానికి సుమారు 300 మైళ్ళదూరంలో - అంటే మద్రాసులో - ఉన్నాను. మీ తోడు. కోడంబాకం దోమల్ని అలక్ష్యంచేసి కన్నులనిండా నిద్రపోయి, తెల్లవారి లేచి, మీసన్ టీ దుకాణంలో టీ తాగుతుండగా, పక్కని కూర్చుని తెలుగు పత్రిక చదువుతున్న ఆపరిచిత మిత్రునివద్ద అది అరువు తీసుకుని, మిగిలిన వివరాలు చదివాను - కళ్ళజోడు సవరించుకొంటూ.

అందులో ఉపశీర్షిక - "అగ్ని ప్రమాదంలో మహాదాత్రి సావిత్రమ్మ గారి అకాల మరణం" విలేఖరి ఉత్ప్రేక్షించాడుగాని, "అకాలమరణం", ఏమిటి? నా భార్య వయసు 65, నాకు డెబ్భై. "ఆకస్మిక" గుర్తురాక "అకాల " అని ఉంటాడు.

"దివి 1974 డిసెంబరు 25 రాత్రి సుమారు 2 గంటలకు ఊరంతా నిద్రపోతున్న సమయంలో, "బాలగృహం" తోటలో ఒక మూల ఉన్న పంచవటి అనే కుటీరం - శ్రీమతి సావిత్రమ్మగారు తమకోసం స్వయంగా నిర్మించుకున్నది - అగ్నికి ఆహుతి అయిపోయింది. ఆ తోట చాలా పెద్దది కావడంవల్లనున్నూ, "బాలగృహం" భవనానికి చాలా దూరంగా ఉండడం వల్లనున్నూ, చుట్టు ప్రక్కల అరమైలు దూరంవరకూ ఇళ్ళు ఏవీలేని కారణం చేతనున్నూ, కుటీరం ఇంచుమించు పూర్తిగా కాలిపోయేవరకు ఎవరికీ తెలియలేదు. తోటమాలి మేలుకునేసరికి మంటలు తగ్గిపోతున్నాయి. "బాలగృహ" వాసులు, బాల బాలికలు, ఉపాధ్యాయులు అక్కడికిచేరి, మంటలు అర్పించి చూసేసరికి, సావిత్రమ్మగారి అస్థిపంజరం మాత్రమే మిగిలింది.

"ఆ ఆవరణలో అసలు భవనానికి సుమారు ఫర్లాంగు దూరంలోనూ, ఊరినుంచి విసిరేసినట్టుగానూ ఉన్న ఆ కుటీరం తనంతట తాను అంటుకోడానికి అవకాశం తక్కువనీ, ఎవరో దుండగులే ఈ పని చేసి ఉంటారనీ పోలీసువారు అనుమాన పడుతున్నారు."

ఆ తరువాత సదరు సావిత్రమ్మగారు పాతిక ఏళ్ళక్రితం ఆ పట్టణం ఎలా వచ్చారో, అతి దుర్భరస్థితిలో ఉన్న ఆ అనాధ శరణాలయాన్ని ఎలా తమ అధీనంలోకి తీసుకుని, "బాలగృహం" గా పేరుమార్చి, కొన్ని లక్షలు దానిమీద ఖర్చుపెట్టి, ఏ విధంగా వృద్ధిలోకి తీసుకొచ్చారో, వంటి వివరాలున్నాయి. కొందరు పట్టణంలోని ప్రముఖుల పొగడ్తలున్నాయి. విషాద ప్రకటనలున్నాయి. స్థానిక మహాకవి 'శిల్పశ్రీ' గారి పద్యాలున్నాయి.

"ప్రథిత చలమయ్యశెట్టి గారాలు పట్టి
విమల కోమలగాత్రి సావిత్రి, దాత్రి-
పంచత్వం పొందడం ప్రపంచడానికే తీరని కొరత" అన్నాడా మహాకవి.

"విమల కోమలగాత్రి" అని చదవగానే నాకు నవ్వు ఆగలేదు. అంత దారుణ సంఘటన గురించి చదువుతూ అలా నవ్వుతుంటే ఎవరికైనా అనుమానం కలగడం సహజం. పత్రిక కొనుక్కొచ్చిన "అపరిచిత మిత్రుడు" నా వంక ఆదోలాగ చూసేసరికి, అతనికి పత్రిక అప్పగించి కాస్త తొందరగానే అవతలపడ్డాను. మహా అనుకుంటే నేను పిచ్చివాడిననుకుంటాడు. ఫరవాలేదు. వేపకాయంత పిచ్చి ప్రతివాడికీ ఉంటుంది.

నాకు నవ్వు రావడానికి అదొకటే కాదు. ఆ పద్యంలో ఇంకా ఒకటి రెండు ఉన్నాయి. మా చలమయ్య మామ ఇంటిపేరు "ప్రథిత" కాదు. అది కవిగారి మరో ఉత్ప్రేక్ష కావచ్చు. ఆయన శెట్టి అంతకన్న కాదు. కమ్మరి; సావిత్రి ఆయన గారాలుపట్టి అసలే కాదు. "పట్టి" మాత్రమే.

1939. బ్రిటిష్ ప్రభువులు భారతదేశాన్ని కూడా యుద్ధంలోకి దింపారు, భారతీయుల ఒప్పుదల లేకుండానే. మాది ట్రంకురోడ్డు మీదున్న ఒక ఊరు. పల్లెకన్న పెద్దది, పట్నానికన్న చిన్నది. మా ఊళ్ళో బాగా ప్రసిద్ధికెక్కినవి మారుతీ టాకీసూ, మంగరాజు లాడ్జీ. రెంటికీ నేను కమీషన్ ఏజెంటుని. అంటే మారుతీ టాకీసులో రెండో అట అయిందాకా గేటు కాపలా కాసి, ఆ రాత్రి ఇంక తిరిగిపోడానికి సంకోచించే పొరుగూరి పెద్దమనుషుల్ని మంగరాజు లాడ్జికి చేర్చడం నాడ్యూటీ. మంగరాజు లాడ్జిలో రాత్రి సౌకర్యాలన్నీ దొరుకుతాయి. రేటు సామాన్యులకు అందుబాటులోదే. యుద్ధం వచ్చి రెండింటి వ్యాపారాన్నీ కాస్త పెంచింది. ఎలాగంటే ట్రంకురోడ్డులో పోయే సైనిక దళాలు సాధారణంగా రాత్రి మా ఊరి పక్క పెద్ద తోపులో వేసిన గుడారాల్లో విశ్రాంతికోసం ఆగేవి. సైనికోద్యోగులికీ, సైనికులకీ, గుడారాల్లో లేని ఇతర సౌకర్యాలు మంగరాజు లాడ్జిలో అలవాటు చేసింది నేనే. వాళ్ళకి అర్థమయే ఇంగ్లీషు, హిందీ భాషల్లో అక్కడ దొరికే సౌకర్యాల్ని కాస్తా ధారాళంగా వివరించగలవాణ్ణి మా ఊళ్ళో నేను ఒక్కణ్ణే. ఆ విధంగా నా పేరు సైనిక పటాలాలకు బాగా చనువై పోయింది. కొత్త దళం ఏదన్నా విడిది చెయ్యగానే, "మోహనరంగం" ఎక్కడున్నాడని వాకబు చెయ్యడం రివాజైపోయింది. మూడు నాలుగు నెల్లు నా పనీ, మంగరాజు పనీ మూడుపువ్వులూ, ఆరుకాయలుగా సాగింది. కాని లాభసాటి వ్యాపారం. పోటీలేకుండా ఎన్నాళ్ళు సాగుతుంది? కేవలం ఇంగ్లీషు బొమ్మలు ఆడే "జెమిని థియేటర్" ఊరి పొలిమేరలో వెలిసింది. 24 గదులతో, మంచి సౌకర్యాలతో "అప్సర లాడ్జింగ్ హౌస్" తయారయింది. ఆ రెంటికీ కలిపి కొత్త కమిషన్ ఏజెంటు, "ఆచారి" అవతరించాడు. సైన్యంలో ఎన్ని భాషలుంటాయో, అన్ని భాషల్లోనూ దంచి మాట్లాడెయ్యగలడు. పూర్తి పేరు వీరభద్రాచారి. కులం "విశ్వబ్రాహ్మణ". మంగరాజుతో పాటు నా వ్యాపారమూ దెబ్బతింది. పైగా ఆచారి సూటు వేస్తాడు. ఖరీదైన సిగరెట్లు కాలుస్తాడు. అతని బూట్లు తళతళ మెరుస్తుంటాయి. అదీగాక అతనికి నా లాగ దృష్టిలోపం లేదు. నాకు దగ్గరవేగాని దూరం వస్తువులు కనబడవు. దీనికీ ఈ కథకీ కొంత సంబంధం ఉంది. లేకపోతే సావిత్రిని నేనెలా పెళ్ళాడ గలుగుతాను? ఆ విషయానికి తరవాత వస్తాను.

ఒకనాడు, సుమారు ఏడడుగుల సైనికాధికారి ఒకాయన మా మారుతీహాలు ఎదుట తన జీపు దిగి ఏదో పరీక్ష చేస్తున్నాడు. దగ్గరకు పోయి చూసే దాకా నాకు ఆయన సమస్య బోధపడలేదు. ఆయన ఏదో ముక్కు భాషలో ఏదో అడిగారు. నాకు తలా తోకా తెలియలేదు. ఇంతలో ఆచారి వచ్చాడు. తన్ను పరిచయం చేసుకున్నాడు. అధికారి ముఖం నవ్వుతో విప్పారింది.

"హెలో శారీ! ఐవ్ హర్ట్..." అన్నాడేదో. తరవాత తనకేం కావాలో ఆచారికి చెప్పాడు. అప్పుడు ఆచారి నా వంక తిరిగి.

"ఒరే రంగా! .... వాడి కెంత పొగరు! మన కమ్మరి చలమయ్య కొలిమి దగ్గరికి ఇది తోయించుకుపో. ఈ డ్రైవరుంటాడు కూడా. అతను చెపుతాడు ఏం చెయ్యాలో." అని నాకు పురమాయించి డ్రైవర్నీ జీపునీ నా కొదిలి తను ఆ అధికారిని "అప్సర లాడ్జింగ్"కి తీసుకుపోయాడు.

ఆ కమ్మరి చలమయ్యే పద్యంలో "చలమయ్యశెట్టి."

అర్ధరాత్రి చలమయ్యని లేపి, కొలిమి వెలిగింపించి, విరిగిపోయిన జీపు ఊచ ఏదో అతకమని పురమాయించి, ఆ డ్రైవర్ని మంగరాజు లాడ్జికి చేర్చాను. దొరికిన వ్యాపారం వొదిలి పెట్టకూడదుగా. అరగంట లాడ్జిలో గడిపి, తన అవసరం తీర్చుకుని, ఆ డ్రైవరు, ఈ సంగతి "దొర"కి నేను చెప్పకుండా ఉండడానికిగాను, నా చేతిలో కమీషన్ కాకుండా ఒక పది రూపాయలు పెట్టాడు. దొరకి ఇలాంటివంటే మహా చెడ్డ కోపమట. మరి అతన్ని అప్సర లాడ్జికి తీసుకుపోయాడే ఆచారి. దాని పర్యవసానం చలమయ్య కొలిమి దగ్గరకు చేరగానే నా కర్థమైపోయింది.

ఆచారి ముఖాన్ని నెత్తురు చుక్కలేదు. హడలిపోయి ఏదో ఎడతెరిపిలేని ఇంగ్లీషులో బతిమాలుతున్నాడు. సమాధానంగా ఆ అధికారి అతన్ని పెఢీమని చెంపమీద కొట్టాడు. తూలి కింద పడిపోయాడు చారి. ఆ తరవాత డ్రైవర్ వంక తిరిగాడు. అతను పెనుగాలిలో ఎండుటాకులా వొణికి పోతున్నాడు. నాకు అర్థమైపోయింది. తియ్యగా నవ్వుతూ..

"సినీమా సార్. ఇంగ్లీష్, గుడ్ సార్, వెరీ గుడ్." అన్నాను.

ఆ రాత్రితో మా ఊరి పక్క "సైనిక విడిది" మరో వంద మైళ్ళ దూరానికి మార్చబడింది. "అప్సర లాడ్జ్". "జెమినీ థియేటర్" తరలి వెళ్ళిపోయాయి. మారుతీ టాకీసూ, మంగరాజూ, నేనూ మిగిలాం. కాని మాకూ వ్యాపారం సన్నగిల్లింది. పూట గడవడం కష్టమైపోయింది. మంగరాజు లాడ్జిలో "పిల్లలు" క్రమంగా మాయం కావడం మొదలెట్టారు. మంగరాజు మద్రాసు మకాం మార్చింది. నేనూ కూడా వెడదామనుకున్నాను. అప్పుడు మంగరాజే నా కొక దారి చూపించింది – మద్రాసు వెళ్ళేముందు సావిత్రికీ నాకూ పెళ్ళి ఏర్పాటు చేసింది. అన్నట్టు మరిచిపోయాను. మంగరాజంటే మగవాడు అనుకుంటున్నారేమో – ఒకప్పుడు చాలా పేరున్న వేశ్య. ఇప్పుడు 'మాత.'

సావిత్రి పూర్వ చరిత్ర చెప్పే ముందు, చలమయ్య ఉత్తర చరిత్ర ముగిస్తాను. "దొర" (ఇందాకా చెప్పిన సైనికాధికారి) చలమయ్యని ఆ రాత్రికి రాత్రే ఉచ్చదశకి లేవనెత్తాలని తీర్మానించుకోడానికి కారణం – కేవలం ఒక ఇనప ఊచ సరిగ్గా అతకడంలో అతను చూపిన చాకచక్యం ఒకటే కాదు – ఆచారిని ఆ దొర కొట్టినప్పుడు చలమయ్య ఆచారి మీద ఊశాడు.

"తన్నండి లంజాకొడుకుని. ఊరికి శనిలా దాపరించాడు. ఈడొచ్చాక సంసారుల్నందర్నీ సానోళ్ళతో కలిపేత్తన్నాడు. తుపాకేసి కాల్చెయ్యండి నాకొడుకుని," అంటూ అరిచాడు.

ఆచారి పారిపోయాక, చలమయ్య అన్నదేమిటని, దొర డ్రైవర్ని అడిగాడు ఇంగ్లీషులో. డ్రైవరు నన్నడిగాడు హిందీలో. నేనేదో విధంగా ఇంగ్లీషులోనే విషయం దొరకి బోధపరిచాను.

"రోగ్... ఫామిలీ గర్ల్స్... స్పాయిల్... హి... డెవిల్" అంటూ దొర అప్యాయంగా నవ్వాడు. చెయ్యి జాపాడు కరచాలనం చెయ్యడానికి. చలమయ్యకి అర్థంకాకపోతే ఆయనే అతని చెయ్యి పట్టుకుని ఊపాడు. చలమయ్య ఇబ్బందిలో పడిపోయాడు. చెయ్యి లాక్కుని దొరకి చూపిస్తూ –

"మసి – ఒసేయ్ – నీళ్ళట్రా," అని పెళ్ళాన్ని పిలిచాడు. దొరకి అర్థమైంది. ఆవిడ పట్టుకొచ్చిన నీళ్ళతో చెయ్యి కడుక్కుంటూ –

"నో మేటర్.. వుయి కెన్ వాషాప్ దిస్ డస్ట్. బట్ దట్ రోగ్ ఈజ్ పీల్థీ ఆల్ ఓవర్..."అన్నాడు.

ఆ రోజుని దొర ఇలా అని ఉంటారని ఈ రోజుకి ఊహించుకుని చెపుతున్నానే కాని, ఆ రాత్రి నా కది పూర్తిగా అర్థం కాలేదు. ఇప్పుడే నేను చాలా భాషల్లో పండితుణ్ని.

తరవాత ఆ దొర చలమయ్యకి పది రూపాయిలిచ్చి చాలా అన్నట్లు సంజ్ఞతోనే అడిగాడు. చలమయ్య స్తబ్ధు. దొరని ఆగమని, ఇంట్లోకి పోయి, చిల్లర తెచ్చి తొమ్మిది రూపాయిల పావలా తిరిగి ఇవ్వబోయాడు. దొర "కీపిట్" అంటాడు. చలమయ్య వద్దంటాడు. ఎంత బలవంతం చేసినా చలమయ్య ముప్పావలా పైని దమ్మిడీ పుచ్చుకోలేదు. దొరకి అతని మీద మరింత అభిమానం పెరిగింది. జేబులోంచి ఒక కార్డు తీసి ఇస్తూ–

"కమ్ అండ్ మీట్ మి. కల్‌కటా" అని చెప్పేసి చలమయ్య వీపుమీద అప్యాయంగా తట్టి వెళ్ళిపోయాడు జీపులో.

నేను చలమయ్యకి చెప్పాను – ఆయన కలకత్తా రమ్మంటున్నాడని. చలమయ్య చప్పరించేసి ఊరుకున్నాడు. నాకు అతనంటే అసూయ, కోపం కూడా వచ్చాయి. యిలాంటి అవకాశం ఎవడన్నా వొదులుకుంటాడా.

అప్పటికి సావిత్రికి 30 దాటి ఉంటాయి. ఇంతవరూ ఆమెకు పెళ్ళి కాకపోవడానికి అనేక కారణాలున్నాయి.

చిన్నప్పుడు, నా చూపు అంతగా దెబ్బతినని రోజుల్లో, సావిత్రిని నేను రోజూ చూస్తుండేవాడిని. అందుకే "శిల్పశ్రీ" పద్యంలో "విమల కోమల గాత్రి" అని చదవగానే నాకు అంత నవ్వొచ్చింది. సాటి పిల్లలు ఆమెను "కొండముచ్చు" అనేవారు. రంగు, రూపం విషయంలో ఆ పిలుపు సమర్థనీయమే అయినా, ఆమెకు తగని కోపం వచ్చేది. తన్ను అని పిలిచిన పిల్లల మీద రాళ్ళు రువ్వేది. వాళ్ళని తరిమేది. ఒకసారి నన్ను పట్టుకుని కొట్టింది కూడా. తల్లి తన ఎత్తి పొడుపులతో, బుగ్గపోట్లతో, తళతళ మెరిసే గిల్టునగలతో సావిత్రిని కాస్త పరవాలేదనిపించే ఆడపిల్లలా తయారు చెయ్యాలని మహా

తాపత్రయ పడింది. ఆమె వల్ల కాలేదు. చలమయ్యకి కూతురంటే ఇష్టమూ లేదు, అయిష్టమూ లేదు. ఆమెకు రూపంతోపాటు, వల్లమాలిన కోపంవల్ల, కమ్మర్లలో పెళ్ళి కొడుకులు కాస్త కరువు కావడంవల్ల, తల్లి ఎంత ప్రయత్నించినా ఆమెకు సకాలంలో పెళ్ళి కాలేదు. సావిత్రి ముదిరిపోయింది. మనిషై పుట్టాక ఏదో వ్యాపకం ఉండాలిగా. సావిత్రి చీకటితోటే స్నానం చేసి, పొలాలమ్మట పడేది. చలమయ్యకి ఒక రెండెకరాల కొంద్ర కూడా ఉండేది. అందులో జొన్న వేసేవాడు. సావిత్రి ఆ జొన్న చేను చుట్టూ జానెడు పొద్దెక్కేదాకా తిరిగేది. కాస్త లేత కంకెలు కోసుకుని, కాల్చి, అవి పట్టుకుని మా ఊరి బడి వరండాలో తింటూ కూర్చునేది. కిటికీలోంచి మాస్టార్లూ, బోర్డూ కనబడేది కాబోలు. కేవలం వినడం, చూడడం ద్వారా కాస్త చదువు బాగానే అబ్బింది సావిత్రికి. అప్పుడప్పుడు పిల్లలకు "హోంవర్కు" చేసిపెట్టే స్థితికి కూడా వచ్చింది. ఆ స్కూలు వరండా ట్రంకు రోడ్డుని అనుకుని ఉండడం మూలంగా, వొచ్చేపోయే బస్సులు, బళ్ళు, జనం, సైనిక పటాలాలూ, అన్నీ చూస్తూ రోజల్లా గడిపేది. ఏ మొగాడి వంకా ఆమె ప్రత్యేకంగా చూసి యెరగదు. ఏ మొగాడి దృష్టినీ ఆమె అంతగా ఆకర్షించలేదు కూడా. ఇక దీనికి పెళ్ళికాదని తల్లీ తండ్రీ నిరాశ చేసుకున్నారు. ఆమె దారిని ఆమెను వదిలేశారు.

అయితే, ఆమెకు పెళ్ళి అయింది, ఆమె తల్లీ అయింది. కాస్త ముందు వెనకలకేం? రెండో సంగతి నాకు తెలియదని - ఊళ్ళో ఎవరికీ తెలియదని - వాళ్ళ అనుమానం లాంటి భ్రమ.

చెప్పానుగా, "సైనికి విడిది" తరలిపోడంతోటే నాకూ మంగరాజుకీ గడ్డు రోజులు ప్రారంభమయ్యాయి. కాస్త ఆ ఊళ్లో పచ్చగా ఉన్నది కమ్మరి చలమయ్యే. నేను అతనికి తిత్తికొట్టడం మెదలెట్టాను. మొదటి రోజునే నా కళ్ళజోడు కొలిమిలో పడిపోయి కరిగిపోయింది. ఆ తరవాత కొనుక్కోడానికి డబ్బూ అవసరమూ కూడా లేకుండా పోయాయి. అంతే కాదు, లోకం మీద పాత అసహ్యం పోయింది; కొలిమి మంట గులాబి రంగు నా కంటి యెదట తెరలాగ వ్యాపించింది. లోకం అందంగా కనిపించడం మొదలెట్టింది. సావిత్రి కురూపం కొన్ని ఏళ్ళుగా అలవాటై పోయినా, అందులో కూడా ఏదో కంటికి నిండైన వైశాల్యం, అందం కనిపించేవి. క్రమంగా ఆమె రొమ్ముల ఎత్తుకి కడుపు కూడా పెరుగుతోందన్న అనుమానం నా కంటికి తగిలినా, దాని వివరాలు సేకరించాలన్న కుతూహలం నాకు కలగలేదు. ఆమె నడుము వైశాల్యం ఆమె విగ్రహానికి మరొక అందంలాగ నాకు అనిపించేది. నిండుగా ఉన్నది ఏది చూసినా నా ఆకలి కడుపు నిండినట్టుండేది.

ఒకనాడు మామూలుగా నేను తిత్తికొట్టడానికి పోయేసరికి, చలమయ్య ఇల్లు తాళం వేసి వుంది. నాకు రెండు పూటలా దొరికే తిండి కరువైపోయింది. మంగరాజే పాత సావాసం గుర్తుంచుకుని కాసిని గంజి నీళ్ళు పోసేది. ఆ అరుగుమీదే చెయ్యి తలగడగా చేసుకుని పడుకునే వాడిని. చేద్దామన్నా చేతయిన పనేదీ లేదు. చెయ్యడానికి ఓపిక తెచ్చుకున్నా, కళ్ళు గజందాటి చూడలేవు. మనసూ, శరీరం నీరసించిపోతోంది. మంగరాజు మకాం మద్రాసు మార్చడానికి నిర్ణయించుకుంది. ఎవరో కాస్త మంచి పిల్ల

దొరికింది ఆమెకు. నన్ను రమ్మని మాటవరసకన్నా అనలేదు. అంటే జీడిలా పట్టుకుంటానని భయం కాబోలు.

అప్పుడు, మూడు నాలుగు నెల్ల తరవాత, చలమయ్య సకుటుంబంగా మా వూరికి తిరిగి వచ్చాడు – తళతళ మెరిసే కారులో, పొందూరు ఖద్దరు పంచీ జుబ్బాలో, కాకీ దుస్తులు వేసుకున్న డ్రైవరుతో. మొదట అతన్ని కళ్ళు బాగున్న మా ఊరివాళ్ళే ఆనమాలు పట్టకపోతే బొత్తిగా దగ్గర చూపు వాణ్ని నేనేం ఆనమాలు పడతాను. నా దగ్గరగా వచ్చి–

"ఏరా రంగా? బాగున్నావా?" అంటూ నా భుజం చరిచిన కొద్దిసేపటికి అతను చలమయ్య అని అతని గొంతు చెప్పింది నాకు. నాకు గుటక పడలేదు. చలమయ్య మా ఊళ్లో ఇల్లూ పొలం వచ్చిన ధరకి అమ్మేశాడు. ఆ తరవాత మంగరాజూ అతనూ సంప్రదించుకుని నన్ను సావిత్రికి భర్తగా నిర్ణయించారు. నా ఒప్పుదల అవసరమని కూడా వాళ్ళకి తోచలేదు. అభ్యంతరం చెప్పే ఓపిక కూడా నాకు లేదని మంగరాజుకి తెలుసు.

తిరుపతిలో నాకూ సావిత్రికీ పెళ్ళయింది. తిరిగి వస్తుంటే – కారణం తెలియదుగాని – కారు తిరగబడింది – కొండ దిగుతుంటే. చలమయ్యా భార్యా పోయారు. సావిత్రి నాలుగు నెల్లు అస్పత్రిలో ఉండి, తోపుడు కుర్చీలో బయటపడింది. అప్పటికి కారు బాగుపడింది. సావిత్రీ, నేనూ, ఆమె తోపుడు కుర్చీ, నేరుగా ఆ పట్టణం చేరుకున్నాం. చలమయ్య కట్టిన నాలుగు అంతస్థుల మేడ ఆమె ఎక్కలేదు. నాకు ఎక్కాలనీ లేదు. మా ఇద్దరికీ కింద అంతస్థే ఎక్కువ. ఆమె తోపుడు కుర్చీలో కూర్చుని, నన్నూ, ఇంటినీ, ఆ ఊరి అనాథ శరణాలయాన్నీ, (ఆ తరవాత అదే "బాలగృహం" అయింది.) ఊరి రాజకీయాల్నీ ఏకచ్ఛత్రంగా ఏలింది.

కారు ప్రమాదంలోంచి తేరుకున్నాక, రెండు పూటలా మంచి తిండితో నా శరీరం కాస్త మెరుగెక్కాక, తిరుపతి ఆస్పత్రిలోనే నా కళ్ళు పరీక్ష చేయించుకుని, ఒక కళ్ళజోడు తగిలించాక, లోకం కాస్త స్ఫుటంగా కనబడ్డం మొదలెట్టాక, నాకు కొంచెం కుతూహలం పెరిగింది – కొన్ని ప్రశ్నలకు సమాధానం వెతకాలని.

అకస్మాత్తుగా రాత్రికి రాత్రి చలమయ్య మా ఊరినించి ఎందుకు అంతర్ధానమయాడు – కుటుంబంతో సహా?

నాలుగు నెలల్లో మంచి కారు, నాలుగంతస్థుల మేడ ఎలా సంపాదించగలిగాడు? సావిత్రి నడుంచుట్టూ వైశాల్యం ఏమయింది?

సావిత్రి ఆస్పత్రినించి బయట పడేలోగా, ఆమె పురమాయింపు మీద నేను ఇల్లూ కొన్ని ఇతర వ్యవహారాలూ చూడ్డానికి ఆ పట్టణం రెండు మూడుసార్లు వెళ్ళాను. అక్కడ ఆ నోటా ఆ నోటా విన్న వివరాలు–

చలమయ్య తన ఇల్లూ ఆస్తీ అమ్మడానికి మా ఊరు రావడానికి ఒక నెల ముందు, ఆ పట్టణంలో స్థిరపడ్డాడట. నాలుగంతస్థుల మేడ అతను కట్టించింది కాదు – కొన్నదట. అతను కాకినాడనించి అక్కడికి వచ్చాడట.

సావిత్రితో చెప్పకుండా నేను కాకినాడ వెళ్ళాను. అక్కడ అతి ప్రయత్నంమీద లాగిన వివరాలు–

సావిత్రి నెలరోజులు ఆస్పత్రిలో ఉందట. ఒక రాత్రి ఆమె బాధగా అరవడం ఇరుగు పొరుగు గదుల్లో రోగులు చెవులారా విన్నారు. అర్ధరాత్రి దాటాక ఆమె కేకలు ఆగిపోయాయి. మరునాటి ఉదయం (నేను తేదీలు నా పరిశోధన ద్వారా పట్టానులెండి) తెల్లవారేసరికి, పొత్తిళ్ళలో ఒక మగబిడ్డ ఆ పట్టణం అనాధ శరణాలయం వరండాలో ఉన్నాడట. "కన్న" అని ఒక చిన్న చీటీ బిడ్డ పక్కని ఉందట. ఆ "కన్న" తరవాత మా బిడ్డడయాడనుకోండి. ఆ కథకి తరవాత వస్తాను.

చలమయ్య కాకినాడ వచ్చిన రెండో రోజుని, జీప్‌లో ఎక్కడికో పోతూ ఆ ఏడుడుగుల ఆంగ్ల సైనికాధికారి, రోడ్డు పక్కన నడిచిపోతున్న అతన్ని చూశాడట. తనతో కూడ జీప్‌లో ఎక్కించుకుని పోయాడట. అప్పటికప్పుడే కాకినాడలో ఒక పెద్ద సైనిక కేంద్రం తయారయింది. కొన్ని ఓడలనిండా ఎక్కడినించో ముళ్ళతీగ, డ్రైమనురేకు మొదలైన ఇనపసామాను అక్కడ దిగిందట. అవి అమ్మడానికి ఆ సైనికాధికారి చలమయ్యని ఏజెంటుగా పెట్టాడట. అందులో కొన్ని లక్షలు మిగిలాయి. ఆ తరవాత అక్కడ నెలకొల్పిన ఆస్పత్రి, దానికి సంబంధించిన షెడ్లు కట్టడానికి చలమయ్యకి కాంట్రాక్టు ఇచ్చాడట ఆ దొరే. రెండు మూడు నెలల్లో కమ్మరి చలమయ్య లక్షాధికారి అయాడు. ఆ తరవాత మకాం ఈ పట్టణానికి మార్చేశాడు. జపాను వాళ్ళు ఒక పక్కనిండీ, జర్మనీ వాళ్ళు రెండో పక్కనించీ దిగి వచ్చేస్తున్నారన్న పుకార్లు పెరిగిపోయాయి. అయిన కాడికి ఇళ్ళు అమ్ముకుని కొందరు సముద్ర తీరాన్నించి దూరంగా ఉన్న ఊళ్లు పోతున్నారు. చలమయ్య రెండంతస్థుల మేడ ఒకటి చవగ్గా కొని, దానిమీద మరో రెండంతస్తులు కట్టారు. కారు కొన్నాడు. అప్పుడు చలమయ్య శెట్టిగా మారి ఆస్తి అమ్మడానికి మా వూరొచ్చాడు.

సావిత్రీ నేనూ ఇంటికి తిరిగి వచ్చాక, ఆమె నా కళ్ళజోడు విరగ్గొట్టేసింది. నా కళ్ళు చాలా అందమైనవట! కళ్ళజోడు ఆ అందాన్ని నాశనం చేస్తోందట! నాకు మళ్ళీ దూరపు చూపు పోయి, దగ్గర చూపు అలవాటైంది. బహుశా తన "అందాన్నీ", ఆ తోపుడు కుర్చీని మరీ స్పష్టంగా నిత్యం చూస్తుంటే నేనెక్కడికన్నా పారిపోతానని భయపడిందేమో సావిత్రి. ఆమె కాభయం అనవసరం. అన్ని లక్షల్నీ, ఆ సుఖాన్నీ వదలిపెట్టి నేనెక్కడికి పోతాను? కాస్త విరివిగా డబ్బు నా చేతికి చిక్కినా ప్రమాదమే అనుకుంది కాబోలు – నా దగ్గర ఎప్పుడూ వందకి మించి ఉండనిచ్చేది కాదు. నలభై దాటాక, ఆ మాత్రం స్థిరమైన ఆశ్రయం నా బోటివాడు వొదిలిపెట్టి పోలేడని ఆమెకు అర్థం కాలేదు. ఆమె భయం ఆమెది. ఆ తరువాత, నన్ను ఆ ఇంటికే కాకుండా, ఆ ఊరికే కట్టబెట్టాలని, నన్ను మునిసిపల్ ఎన్నికల్లో నిలబెట్టింది. ఒక లకారం ఖర్చుపెడితే నేను ఛేర్మెన్ అయ్యే పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. నలుగురు ఊరి పెద్దల్నీ పిలిపించి మాట్లాడింది కూడా. నేను మెంబరుగా ఎన్నిక కాగానే, ఆ ఊరి అనాధశరణాలయం పక్కనున్న పెద్ద తోట కొనేసింది. అది ఆ శరణాలయానికి దానం చేసేసింది. సావిత్రి దంపతుల పలుకుబడి పెరిగింది.

ఇంకో వారం రోజుల్లో ఛేర్మెన్ ఎన్నికలున్నాయనగా, ఊరి పెద్దలకి అయిదారు వేలు ఇచ్చి ఒక ఊరేగింపు ఏర్పాటు చేయించింది. బాజా భజంత్రీలతో, మందుగుండు సామాగ్రితో, వేలాది జనం, ముందూ వెనకా, మేడలూ, మిద్దెలూ ఎక్కి చూస్తున్నారు. నేనూ సావిత్రీ టాపులేని కారులో పెద్ద పూలమాలల బరువుతోపాటు, జనం మెప్పుదల కూడా మెడలువంచి మోస్తూ, ఊరేగుతున్నాం. మూడు బాజాలు, మందుగుండు సామగ్రి, ప్రజల జయ జయధ్వానాలు. నాకు ఎక్కడో ఏదో స్వర్గంలో ఉన్నట్టుంది. మంగరాజు ఇంటికి "పాసింజర్లని" చేర్చి పొట్ట పోసుకునే ఈ మోహనరంగం ఇంతవాడయాడు! ముందు ఎక్కడో మరీ పెద్ద చప్పుడైంది. జనం గోల మిన్నుముట్టింది. అదంతా నా యెడల జనం చూపిస్తున్న గౌరవమే ననుకుని మరింత ఉత్సాహంగా కార్లో లేచి నిలబడి, దణ్ణంపెడతూ—

"చాలా సంతోషం!

చాలా సంతోషం!!" అంటున్నాను.

సావిత్రి నన్ను చెయ్యిపట్టి లాగుతున్నా నేను కూర్చోలేదు— "సంతోషం" అంటూనే ఉన్నాను.

దాంతో నా ఛేర్మెన్ ఛాన్సు స్థాపితం అయింది. ముందు ఔటు పేలి, నలుగురైదుగురు "తన గౌరవార్థం" చచ్చిపోతే, మరో పదిమంది చేతులూ కాళ్ళూ – ఎవరివి ఏవో తెలీకుండా కలగాపులగం అయిపోతే, "చాలా సంతోషపడే" వాడిని ఛేర్మెన్ ఎందుకు చేస్తారు జనం? ఆ శవాలతో కలిపి సజీవదహనం చేస్తారు. నాకు డ్రైవరు తలతప్ప, దానికి అవతల ఉన్నదేమిటో కనబడదని చెప్పుకుంటే మాత్రం వాళ్ళు జాలిదలుస్తారా? నా అదృష్టం కొద్దీ నా సంతోష ప్రకటన సావిత్రీ, కారుకి అటూ ఇటూ నడుస్తున్న కొద్దిమంది పెద్దలూతప్ప మరెవరూ వినలేదు.

ఆ తరవాత పెద్ద ఇల్లు అమ్మేసింది సావిత్రి. అనాధ శరణాలయం తోటలో ఒక మూల ఊరికి దూరంగా "పంచవటి" వేయించింది. నాతో, తోపుడు కుర్చీతో, అందులోకి మకాం మార్చింది. అప్పుడయినా నాకో కళ్ళజోడు కొనిపెట్టలేదు. అదే వాదం – నాకళ్ళ అందం పోతుందని. అంచేత మానసికంగానూ, శారీరకంగానూ నాకు దగ్గర చూపు స్థిరపడిపోయింది.

అప్పుడు తెచ్చింది, కన్నని – మా ఇంటికి. అదే అనాధ శరణాలయంలో ఉన్నాడు వాడు. బిడ్డలులేని దాంపత్యం ఎడారి లాంటిది అంది. తన ప్రేమ అంతా వాడిమీద ఒలకబోసింది. ఆ ప్రేమలో శాసించే గుణం ఉండబట్టి, అది చిన్నప్పటినించీ వాడికి పెద్ద సంకెల అయింది. నేనూ వాడూ ఆమె ప్రేమ వలలో చేపలం, నాకు వయసు మళ్ళింది గనక ఆ వల కొరికేసి బయట పడాలన్న ఆత్రం నాలో అంత బలంగా లేదు. వాడు కుర్రాడు. అంచేత అప్పుడప్పుడు గిలగిల లాడేవాడు. అంత పెద్ద తోటలో, అన్ని చెట్లు, వాటి చిటారు కొమ్మల్ని అన్ని కాయలూ ప్రతినిత్యం కనబడుతుంటే, వాటిని అందుకోవాలన్న ఆకాంక్ష కుర్రాడి కుండదూ? కాని ఆమె వాడిని చెట్టు ఎక్కనిచ్చేది కాదు. ఆమెకు కాళ్ళుంటే అంతగా ఆంక్షలు పెట్టకపోనేమో!? వాడు కూడా ఏ చెట్టుమీద

నించైనా పడితే ఏ కాలన్నా విరుగుతుందన్న భయం ఒకటి, దానికన్న బలమైన అంతర కారణం మరొకటుంది. తనకి కాళ్ళు లేవు. అంచేత చెట్టు ఎక్కలేదు. కాళ్ళున్నా ఆమె చెట్టు ఎక్కగలదా అంటే, అది వేరే విషయం. ప్రయత్నిస్తే ఎక్కగల అవకాశం ఉండేది - కాళ్ళుంటే. ఇప్పుడది లేదు. కన్నగాడిని చెట్టెక్కనిస్తే వాడు నేల విడిచి తనకి అందనంత ఎత్తుకు పోతాడేమో పక్షిలాగ! అలాగే తనకి దొరక్కుండా పోతే? అంచేత "బాలగృహంలో" పిల్లలు ఎవరూ చెట్లు ఎక్కకూడదని ఆమె ఆంక్షపెట్టింది - వాడి కొక్కడికి పెడితే న్యాయంగా ఉండదని. కాని వాడి కుర్రమనసుకి తెలుసు- ఈ ఆంక్ష తన కోసమేనని. కుర్రవాళ్ళ బుద్ధి కొన్ని హృదయానికి సంబంధించిన విషయాల్లో మహా చురుకుగా పనిచేస్తుంది. నేను యింత పరిశోధన చేసి కనిపెట్టిన రహస్యం, కన్న అతి సులభంగా గ్రహించేశాడు- తన అసలు తల్లి కూడ సావిత్రేనని.

తన స్కూలు పుస్తకాలమీద "కర్ణ" అని రాసుకున్నాడు!

సావిత్రి ఒకనాడు వాడి పుస్తకాలు తిరగేస్తూ ఆ పేరే చూసింది. వాణ్ని పిలిచి అడిగింది. వాడన్నాడు-

"ఏ గొంతెమ్మో నన్ను కని ఇక్కడ పారేసిందిగా."

నాకు ఆశ్చర్యం వేసింది. "కుంతి" అనకుండా "గొంతెమ్మ" అన్నాడు - ఆమెను నీచ దేవతగా మార్చేసి. నాకు కడుపు నిండినట్టయింది కూడా - ఎవరిమీదో కసి తీర్చుకున్నట్టు.

సావిత్రి ఆ రోజంతా మహా చిరాకుగా ఉంది. "బాలగృహం" టీచర్ల నందరినీ పిలిచి, ఇది మూసేస్తానని బెదిరించింది. లేని తప్పులన్నీ ఎత్తిచూపింది. తోపుడు కుర్చీలో వేగంగా అస్థిరంగా పిచ్చిగా తోటంతా తిరిగింది ఆ రోజుని. ఆ రాత్రికి ఆ జోరు పూర్తిగా చచ్చిపోయింది. తెల్లవార్లూ ఆ కుర్చీలోనే కూర్చుంది, పడుకోకుండా. తెల్లవారే సరికి ఆమె కళ్ళను అనంతమైన దిగులు, భయం ఆవహించాయి. ఎవరితోటీ ఆ రోజల్లా మాట్లాడలేదు సావిత్రి. నేను అతి దగ్గరగా ఉండి పరిశీలనగా చూస్తున్నాను. సాయంత్రం స్కూలు వదలిపెట్టారు. కన్నగాడు కుటీరానికి వచ్చాడు. సావిత్రి వాణ్ని పిలిచింది, "కన్నా" అని. అది తన పేరు కాదన్నట్టు ఊరుకున్నాడు. తోపుడు కుర్చీ తోసుకుంటూ వచ్చింది వాడి దగ్గరకు.

"పలకవేం పిలుస్తుంటే?"

నా పేరు "కర్ణ" అన్నాడు వాడు, ఆమె వంక తిరక్కుండానే. చెప్పరాని ఆవేశంతో వాడిని తన పక్కకి తిప్పుకుంది, ముందుకు వంగి. నేను పట్టుకోకపోతే పడిపోయేదే. వాడి బిగిసిన పెదవుల వెనక వెటకారపు చిరునవ్వు అస్పష్టంగా చూశాను. చూశానని అనుకున్నాను. తల్లీ కొడుకూ ఎంతసేపు అలా ఒకరినొకరు చూసుకుంటూ నిలబడ్డారో! సావిత్రి తల వాలిపోయింది - ఓడిపోయినట్టు.

డ్రిల్ మాస్టార్ని పిలిపించింది సావిత్రి. రెండు వందల రూపాయలిచ్చి "బాలగృహం" పిల్లల్ని అందర్నీ తీసికెళ్ళి "లవకుశ" చిత్రం చూపించమంది. డ్రిల్ మాస్టరుకి అసలే నత్తి. అందులో ఇది పిడుగులాంటి సువార్త. తన ఆశ్చర్యం మాటల్లో ప్రకటించలేక పోయాడు. ఎనిమిదింటికి ఎక్కడినించో కన్నగాడు తిరిగొచ్చాడు.

"ఎక్కడికి వెళ్ళావురా కన్నా?" అన్నాను. నన్ను మాత్రం "కర్ణ" అనమని వాడు ఎన్నడూ అడగలేదు. నేను తన తండ్రిని కానని వాడికి తెలుసు కాబోలు.

"షికారుకి."

"సినిమాకి వెళ్ళలే?" అంది సావిత్రి. అసలు వాడికోసమే ఈ ప్రోగ్రాం ఆమె తలపెట్టింది.

"చూసేశాను."

"ఎప్పుడు?"

"మొదటి రోజునే, స్కూలు ఎగ్గొట్టి – మాటినీకి."

సావిత్రి ముఖాన నెత్తురు చుక్కలేదు.

"డబ్బులు?" అని అడిగింది.

"పెన్ను అమ్మేశా."

కావాలని అబద్ధాలు కల్పించి చెపుతున్నాడనిపించింది నాకు. ఎందుకంటే, నా జేబులో ఆ రోజుని అయిదు రూపాయిలు కొట్టేసింది వాడేనని నా అనుమానం.

సావిత్రి తన కసి అంతా "బాలగృహం" మీద తీర్చుకుంది. అందరికీ కొత్త ఆంక్షలు పెట్టింది. తీర్చుకున్న కొద్దీ కసి పెరుగుతోందేగాని తరగడంలేదు. కన్నగాడు ఆమె బాధపడుతున్న కొద్దీ లోపల్లోపల సంతోషిస్తున్నాడని నా అనుమానం. పంచవటిలో ప్రతినిత్యం సాగుతున్న ఈ అంతం లేని నాటకం నేను కుతూహలంతో చూస్తూనే ఉన్నాను. ఒక్కనాడూ వాడు గట్టిగా సావిత్రిని ఎదిరించి మాట్లాడలేదు. కాని ఆమెకు లొంగనూ లేదు.

ఒక రోజున రామ్మూర్తి మాస్టరు – "బాలగృహం" స్కూలు హెడ్‌మాస్టరు – కంగారు పడిపోతూ పంచవటికి పరుగెత్తు కొచ్చాడు. సావిత్రి తిరుగుడు కుర్చీలో తోటంతా తనిఖీ చేస్తూ తిరుగుతోంది. కన్నగాడి కాంపోజిషన్ బుక్కు నాకు చూపించి నా సలహా అడిగాడు ఆయన. నేను చదివాను.

"కనకపు సింహాసనముపై కూర్చోబెట్టినను, కుక్క వెనుకటి గుణము మానునా? ఎప్పుడో తెలియని కన్నెప్రాయంలో ఒక తప్పుచేసి బిడ్డను కంది కుంతి. ఆ బిడ్డను ఏటిలో వదిలిపెట్టింది. ఆ తరవాత పాండు రాజు పెండ్లామై, మహారాణీ అయినా వెనుకటి గుణం మానెనా? భర్త వెనుక బాహాటముగా ఒక్కొక్క ప్రియునివలన ఒక్కొక్క బిడ్డను కనెను. పాండురాజువల్ల బిడ్డలు పుట్టరట! ఆయన తరవాత సింహాసనం ఎక్కడానికి వారసుడు కావలెనట! తెలుగు మాస్టారు చెప్పారు. అలాగైతే ధర్మరాజు పుట్టగానే ఆ పని మానెయ్యొచ్చుగా? మరో ఇద్దర్ని ఎందుకు కంది? సొంత సరదా తీర్చుకొనుటకు. పాపం పాండురాజు పోయేనుగాని, బ్రతికి ఉంటే, ఆయన్ని అడ్డు పెట్టుకుని ఎందర్ని కనిపారేసేదో! గాంధారి స్కోరు నూరు దాటేసేది. అందువలన కుంతీదేవి భారతంలో అన్నిటికన్న గొప్ప స్త్రీ పాత్ర."

ఇది సావిత్రికి చూపిస్తే ఏం ప్రమాదమో, చూపించకపోతే ఏం ప్రమాదమో, రామ్మూర్తి మాస్టరు తేల్చుకోలేక తికమక పడిపోతున్నాడు. పైగా ఆ తెలుగు టీచరు శుద్ధ

వెఱ్రి వెంగళాయి. "బాలగృహం" టీచర్లందరికీ అందులోని వ్యాకరణ దోషాలు ఎత్తిచూపుతూ చదివి వినిపించాట్ట. సావిత్రికి ఇది చూపించొద్దని సలహా ఇచ్చాను. అది చింపేసి ఏమీ ఎరగనట్టు ఊరుకోమన్నాను. టీచర్లందరినీ నేను హెచ్చరిస్తానని చెప్పాను. పాపం- ఎంత ఇదయినా సావిత్రి అంటే నాకూ ఒకరకం ఇష్టం, జాలీ ఏడిచాయి మరి.

కాని, కన్న గాడు దేవాంతకుడు. ఆమెకు సూటిగా తగలాలని రాసిన వాడు ఎందుకూరుకుంటాడు? ఆ కాంపోజిషను కాపీ ఒకటి రాసి – కుక్కకీ కుంతికీ బుద్ధి విషయంలోగల సామ్యాన్ని మరింత వివరంగా చెపుతూ – అది సావిత్రి మంచంమీద పెట్టాడు. ఆమె చదువుకుంది. తన ఆవేశాన్ని తోపుడు కుర్చీమీద, నామీద, "బాలగృహం" మీదా వ్యక్తపరిచింది. కనబడితే కన్నని ఏం చేసేదో, వాడు కనబడకండా మాయమైపోయాడు.

మరునాటికి ఆమె కోపం దిగులుగా మారిపోయింది. ఆ తరవాత ఆత్రంగా. పత్రికల్లో వాడి బొమ్మ వేయించింది. వాణ్ని తిరిగి రమ్మని ఎంతగానో బ్రతిమాలుతూ దానికింద ఉత్తరం వేయించింది. వాడు చూడనేలేదో, చూసి కూడా రాలేదో? నన్ను దేశమంతా తిప్పింది. మొదట నాకూ ఇది విడుదలగానే అనిపించింది. చేతినిండా డబ్బు. ఎక్కడికి పడితే అక్కడికి పోవచ్చు. కాని, వాడు ఎక్కడున్నా కనబడితే సావిత్రి వద్దకి చేర్చాలని నిజంగానే ఉండేది. వాడు కనబడలేదు. తిప్పటంటే నాకూ విసుగెత్తింది. రోజులు గడిచిన కొద్దీ వాడు దొరుకుతాడన్న ఆశ అంతరించిపోతోంది. సావిత్రి పూర్తిగా మారిపోయింది. "బాలగృహం" పిల్లల్ని ఎంతో ఆప్యాయంగా చూడ్డం మొదలుపెట్టింది. ఎవరినీ నొప్పించే మాటయినా అనడం మానేసింది. ఊరంతా ఆమెను నిజంగానే గౌరవించడం మొదలు పెట్టారు. ఆమెను మునిసిపల్ ఛేర్మెన్ చేశారు – ఆమె వద్దంటున్నా. ఎమ్.ఎల్.ఏ.ని చేశారు. ఆమె కచ్చితంగా వద్దని చెప్పకపోతే మంత్రి పదవి కూడ అంటగట్టేవారు.

ఈ మార్పు ఊరందరికీ ఆమెకూ మంచిదే అయింది గాని, నాకు మాత్రం చాలా ఇబ్బందిగా తయారయింది. ఇప్పుడు "మోహన రంగం" అనే భర్త ఆమెకు అనవసరం. నేను ఆమె జీవితానికి వేస్ట్‌పేపర్ బాస్కట్ లాగ మిగిలాను.

చటుక్కుని సావిత్రి అన్నిటికీ రాజీనామా ఇచ్చేసింది. శాసనసభ సభ్యత్వానికీ, "బాలగృహం" యాజమాన్యానికీ కూడా.

"పాండిచెరీ వెళ్ళిపోదాం" అంది నాతో – ఆజ్ఞకాకండా అభ్యర్థనా కాకండా. ఆమె గొంతులో ధ్వనించిన నిర్వేదం వింటే నాకు నిజంగా జాలేసింది.

పాండిచేరీలో ఆరు నెల్లున్నాం. తరవాత హృషీకేశ్, కాశీ, దక్షిణేశ్వరం, పూరీ, మళ్ళీ రామేశ్వరం. కొన్ని ఏళ్ళు తిరిగాం – దేన్నో వెతుక్కుంటూ, బహుశా ఎక్కడయినా అనుకోకుండా "కన్న" కనబడతాడేమో నని ఆశ కాబోలు.

ఆ తరవాత తీర్థాలు తిరగడం మానేశాం. తనకి దేవుడిమీద నమ్మకం పోయిందంది సావిత్రి. కాని తిరగడం మానలేదు. ఎక్కడా ఆరునెల్లకన్నా ఉండలేదు మేం.

ఆఖరికి బొంబాయిలో, దాదర్‌లో ఒక చిన్న హోటల్లో తగిలాడు కన్న. అక్కడ "బోయ్"గా పనిచేస్తున్నాడు. నేను కళ్ళజోడు సంగతే మరిచిపోయాను గనక నేను వాణ్ని

గుర్తుపట్టలేదు. వాడు మా మంచాలమీద పక్కలు వేసి, కూజాలో నీళ్ళు పెట్టి వెళ్ళిపోయాక సావిత్రి నాతో అంది:

"వాడే కన్న."

ఆ రాత్రి మాకు భోజనాలు తెచ్చి. వాడే పలకరించాడు – కాస్త వెటకారంతో కూడిన ఆప్యాయతతో.

"మీ రిద్దరూ బాగున్నారా?" అని.

"మన ఊరొచ్చెయ్యి" అంది సావిత్రి.

"ఇక్కడ నాకు సుఖంగానే ఉంది" అన్నాడు కన్న.

సావిత్రి నిట్టూర్చే స్థితి దాటిపోయింది. తన సంచీలోంచి ఒక కాగితాల కట్టతీసి వాడికిచ్చింది.

"ఇది నా చేత్తో నీకివ్వాలని ఇన్నాళ్ళూ నిన్ను వెతుక్కుంటూ దేశం అంతా తిరిగాను. రేపు ఇంటికి వెళ్ళిపోతాను. ఇంక తిరగలేను. నేను వెళ్ళిపోయాక చదువుకో."

మరునాడు బయలుదేరి మద్రాసు వచ్చాం. నాకు కొంత డబ్బిచ్చింది.

"నేను ఒంటరిగా బతకదలుచుకున్నాను. మీరు నాతో రానక్కరలేదు. ఎప్పుడు డబ్బు కావాలన్నా రాయండి, పంపుతాను."

కాని కాళ్ళులేని ముసలి ఆడదాన్ని ఒంటరిగా ఎలా పంపుతాను? ఇద్దరం పంచవటికి తిరిగొచ్చాం.

"బాలగృహం" నిర్వాహకులు చాలా డబ్బు తినేశారు. పిల్లలకు ఏ సౌకర్యాలూ లేవు. టీచర్లకి జీతాలు లేవు. సావిత్రి నెలరోజుల్లో అంతా సరిజేసింది. డబ్బు తినేసిన ముగ్గురు పెద్దల్ని జైలుకి పంపించింది. అసలు రాజ్యాలు ఏలవలసిన మనిషి సావిత్రి.

ఆ తరవాత నేను మద్రాసు వొచ్చేశాను. సావిత్రికి నా అవసరం లేదు, నాకు సావిత్రి అవసరమూ లేదు. చిత్రంగా దూరమైపోయాం. ఆ తరవాత పేపర్లో "పంచవటీ దహనా"న్ని గురించి చదివాను.

నేను "బాలగృహం" చేరేసరికి కన్న కూడా వచ్చాడు,

"కర్మ చేస్తావా?" అన్నాను.

"కర్మలో ఆమెకు నమ్మకం లేదు" అన్నాడు కన్న. సావిత్రి తనకిచ్చిన కాగితాలు నా కిచ్చాడు. చదివాను. అందులో అన్నీ దాపరికం లేకుండా రాసేసింది. తనకు పెళ్ళికాని క్రితమే బిడ్డ ఎలా పుట్టాడో, ఆ బిడ్డని ఆ బాలగృహానికి ఎలా చేర్చారో, ఆ తరవాత ఆబిడ్డకోసమే తను దీని ఆధ్వర్యం ఎలా చేపట్టిందో, ఆ బిడ్డ ఎలా తనకు దూరమైపోయాడో – అన్నీ. తనకి తృప్తీ, మనశ్శాంతీ దొరుకుతాయని తోస్తే, బాలగృహంలోనే సభ ఏర్పాటుచేసి, ఆ కథ అందరికీ చదివి వినిపించమంది కన్నని.

"సభచేసి ఇవన్నీ బయట పెడతావా?" అని అడిగాను.

"ఇప్పుడు నా కసికి గాని ఇష్టానికి గాని అర్థం ఏముంది? రెంటినీ దాటి దూరంగా వెళ్ళిపోయింది... అమ్మ."

వాడి నోటంట ఆ పిలుపు రావాలని బ్రతికున్నన్నాళ్ళూ ఎంతో ఆత్రపడింది. ఆమె పోయాక ఆ కోరిక తీరింది.

**(యువ, దీపావళి 1975)**